


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 223 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 18 ఏప్రిల్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :223 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 18 APRIL 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

### 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి

- యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన
- పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు

మిగతా 2లో



## మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక బిల్లు కాదన్న లావు
- కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న లావు

పెన్ పవర్ డెస్క్:దేశాభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై

మిగతా 2లో

## మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?

- మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించిన పార్టీలపై జగన్ విమర్శలు
- ఈ పరిణామంతో మహిళలకు, దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని వ్యాఖ్య
- 2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి నష్టమని ఆందోళన
- కుటుంబ నియంత్రణ పాటించినందుకు శిక్ష అనుభవించాల్సి వస్తోందని పోస్ట్




పెన్ పవర్ డెస్క్:మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడం వల్ల మహిళలకు, దక్షిణ భారత రాష్ట్రాలకు ఏకకాలంలో అన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026కు మూడింట రెండొంతుల మెజారిటీ లభించని నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపడితే దక్షిణ రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు."ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసలు వాళ్లు ఏం సాధించారు? వాస్తవ పరిస్థితి చూస్తే, దక్షిణాది రాష్ట్రాల సంఖ్యాబలం (సీట్లు) తగ్గిపోతుంది, మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వాయిదా పడింది. దీనివల్ల దక్షిణాదికి న్యాయం జరగలేదు, మహిళలకూ న్యాయం అందలేదు.ఒకవేళ 2026లో జనాభా లెక్కలు తీస్తే, దక్షిణాది పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను మరింతగా శిక్షించినట్లు అవుతుంది. జనాభాను నియంత్రించిన పాపానికి మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసం? ఇది దక్షిణాదిపై చూపిస్తున్న వివక్ష కాదా? రాజకీయ పార్టీలు ఈ అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నాయో అర్థం కావడం లేదు" అని జగన్ ట్వీట్ చేశారు.

## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు:

- వీగిపోయింది డీలిమిటేషన్ బిల్లేనని, మహిళా బిల్లు కాదని వ్యాఖ్య
- విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ
- 2023లో ఆమోదం పొందిన బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్
- 543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం కోటా వర్తింపజేయాలని సూచన

మిగతా 2లో






## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

- అరేబియా సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు వెల్లడి
- ఈ నెల 20 నుంచి 21 వరకు పాకిస్థాన్ నోటమ్ జారీ
- ఈ నెల 22 నుంచి 25 వరకు భారత్ నోటమ్ జారీ

మిగతా 2లో

## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

- మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి
- పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది
- తనిఖీలు నిర్వహించగా లభ్యం కాని అనుమానాస్పద వస్తువులు



మిగతా 2లో

## మీకు మహిళల ఉసురు తగులుతుంది

### విపక్షాలపై అమిత్ షా ఫైర్



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ
- విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

పెన్ పవర్ డెస్క్:మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం

మిగతా 2లో

## మహిళా బిల్లుతో నవశకం..

### ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది: విడదల రజిని

- మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చన్న రజని
- మహిళల అభివృద్ధి కోసం సామాజికి సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని కితాబు
- కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా

మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్...

### లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు



పెన్ పవర్ డెస్క్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన

మిగతా 2లో



## రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

### కీలక బిల్లు ఓటమిపై రాహుల్ గాంధీ

- లోక్‌సభలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోయింది
- బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు.. మెజారిటీకి 60 ఓట్ల దూరంలో ఓటమి
- మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను అడ్డుకున్నామన్న రాహుల్ గాంధీ
- డెలిమిటేషన్‌తో రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా


మిగతా 2లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

### హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ అధికారిక ప్రకటన

మిగతా 2లో



## చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు బయటపెడతా

- చెవిరెడ్డి కుటుంబ అవినీతికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్న పులివర్తి నాని
- వారం రోజుల్లో సినిమా చూపిస్తా అంటూ వార్నింగ్
- చెవిరెడ్డి కొడుకు మోహిత్ రెడ్డివి పిల్ల చేష్టలని ఎద్దేవా
- జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శ

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# డీలిమిటేషన్‌తో దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది. ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ౹ఈఖీ (౹నీబిజీశ్రీ టవతీబితిశ్రీతిబిఎ ఖీజీబివ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి.

అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమావేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

# మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు.

మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

## హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు."లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మ్యూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మ్యూజ్ జలసంధి అత్యంత

వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

- మొదటి పేజి తరువాయి

జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ చారిత్రాత్మక బిల్లు అమలు కాబోతుండటం అభినందనీయమన్నారు.డీలిమిటేషన్ అంశంపై కూడా టీడీపీ తన స్పష్టమైన వైఖరిని చాటింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదని, దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్ ఒక కీలక అడుగని, దీనివల్ల మహిళలతో పాటు యువతకు కూడా రాజకీయాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ఎన్నో ఏళ్లుగా సాగుతున్న పోరాటాలకు ఈ బిల్లుతో ఒక తార్కిక ముగింపు లభిస్తుందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# మహిళా బిల్లుతో నవశకం..

- మొదటి పేజి తరువాయి

శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చని, ఇప్పటికే వైసీపీ ఈ బిల్లుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి కోసం సామాజిక సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని, ఆయన హయాంలో అమలైన 90 శాతం పథకాలు మహిళా సాధికారత కోసమే రూపొందించబడ్డాయని ఆమె పేర్కొన్నారు.అయితే, ఇదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విడదల రజని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయిందని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. "జగనన్న హయాంలో దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలకు భద్రత కల్పిస్తే... నేడు చంద్రబాబు హయాంలో కేవలం 'రెడ్‌బుక్' పాలన మాత్రమే సాగుతోంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, చంద్రబాబులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని వెనక్కి తెచ్చారా? అని నిలదీశారు.

మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజని ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో వారి రక్షణను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు.

# రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

- మొదటి పేజి తరువాయి

బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది.ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.ఈ ఓటమిపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు.మరోవైపు, ఓటర్లు, ఎంపీల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమతుల్యతను సరిదిద్దడానికే డీలిమిటేషన్ అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదించారు. సవరణ బిల్లు ఓటమితో, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను కూడా ముందుకు తీసుకెళ్లబోమని ప్రభుత్వం ప్రకటించింది.

## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది.ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది.అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి

ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటిం చింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదే శాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు.లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు.ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

# చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు బయటపెడతా

తిరుపతి వేదికగా సాగుతున్న రాజకీయ పోరు ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. చంద్రగిరి వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబంపై టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని విరుచుకుపడ్డారు. చెవిరెడ్డి కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలపై తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని, వారం రోజుల్లోనే చెవిరెడ్డికి 'సినిమా చూపిస్తా' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తండ్రి పేరు చెప్పుకుని కోట్లు సంపాదిస్తూ, గర్వంతో ఊగిపోతున్నారంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై మండిపడ్డారు. మోహిత్ రెడ్డి చేసేవి చిన్నపిల్లల చేష్టలని, తమ నాయకుడు నారా లోకేశ్ పేరు ఎత్తితే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన తెగేసి చెప్పారు. లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని, ఆయన పనితీరును విమర్శించే స్థాయి మోహిత్ రెడ్డికి లేదని నాని ధ్వజమెత్తారు. వెన్నుపోటు రాజకీయాలకు చెవిరెడ్డి కుటుంబమే బ్రాండ్ అంబాసిడర్ అని పులివర్తి నాని ఎద్దేవా చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి వంటి నేతలనే కాకుండా, చివరకు జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శించారు. మద్యం డబ్బులు లెక్కిస్తున్న వీడియోల్లో కనిపిస్తున్న కోట్లాది రూపాయల నగదు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుడా వ్యవహారంలో జరిగిన భారీ అవినీతిపై విచారణ వేగంగా సాగుతోందని, అవినీతికి సహకరించిన ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని, వారం రోజుల్లోనే సస్పెన్షన్లు మొదలవుతాయని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలను భయపెట్టడం ఎవరి వల్ల కాదని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని, కానీ తమపై అభాండాలు వేస్తే సహించబోనని స్పష్టం చేశారు.

# ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్...

- మొదటి పేజి తరువాయి

ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు.అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి.

ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# జొన్నాడ సొసైటీలో ధాన్యం కొనుగోలు ప్రారంభం



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 17;**మండలంలోని జొన్నాడ సొసైటీ పరిధి జొన్నాడ, మూలస్థానంలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు స్థానిక రైతు సేవ కేంద్రంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.కె.వి.చౌదరి, సొసైటీ చైర్మన్ మేడపాటి రామారెడ్డి, కూటమి నేత తాడి శ్రీనివాసరెడ్డి(బట్టి శ్రీను), మండల వ్యవసాయ అధికారిని బి.మీనా, తదితరులు రైతులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్ళకు నియమించబడ్డ సిబ్బంది (టెక్నికల్ అసిస్టెంట్, డీఈవో ,హెల్పర్) రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉంటూ, అలసత్వం వహించకుండా, విధులు సక్రమంగా నిర్వర్తించాలని వారంతా సూచించారు. ధాన్యం కొనుగోలు విధివిధానాలు గురించి, తేమశాతం వంటి విషయాలు తదితర అంశాలపై రైతులకు తెలియజేశారు. ధాన్యం మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి 24 నుండి 48 గంటల్లోపు నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రబీ సీజన్లో ఎక్కువగా ఎంటియు 1121 రకం 85 శాతం, ఎంటియు 3626 (బొండాలు) రకం 15 శాతం సాగు చేశారని, ఎకరానికి 55 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. మండల పరిధిలో 10,000 ఎకరాలు వరి సాగు అయిందని, 42,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసామని ఏడిఏ చౌదరి వివరించారు. రైతులందరూ వరి కోతలు కోయడానికి వారం రోజులు ముందు ఎకరానికి 10 కేజీలు పిఎండిఎస్ విత్తనాలు వేసి నేలను సారవంతం చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడి సుబ్బారెడ్డి, తాడి చిన్న రాము, తాడి వెంకట కృష్ణారెడ్డి, దమ్ము సత్యనారాయణ, తాడి రాము, వైట్ల శ్రీను, తదితర రైతులు పాల్గొన్నారు.

# టీం ఆసుపత్రిలో ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం




**కాకినాడ, పెన్ పవర్, ఏప్రిల్ 17:** నాగమల్లి తోట వద్ద ఉన్న టీం ఆసుపత్రిలో ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ ఆదినారాయణ, దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17న ప్రపంచ హీమోఫీలియా దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు.ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచడం మరియు ముందుగానే గుర్తించి ప్రాణాపాయం నివారించడం అని చెప్పారు. హీమోఫీలియా ఒక జన్యుపరమైన రక్త రుగ్మతగా, ముఖ్యంగా పురుషులలో ఎక్కువగా కనిపిస్తుందని, సరైన జాగ్రత్తలు మరియు వైద్యుల పర్యవేక్షణతో బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని వివరించారు. రక్తం గడ్డకట్టడానికి అవసరమైన క్లాటింగ్ ఫ్యాక్టర్స్ లోపించడం వల్ల చిన్న గాయాలకే అధిక రక్తస్రావం జరుగుతుందని తెలిపారు.వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హీమోఫీలియా వ్యవస్థాపకుడు ఫ్రాంక్ ష్నాబెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు.డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న గాయాలకే రక్తం ఆగకుండా కారడం, కీళ్లలో నొప్పి, చిగుళ్ల నుండి రక్తస్రావం, శరీరంపై నీలి మచ్చలు కనిపించడం హీమోఫీలియా లక్షణాలని తెలిపారు.ఈ వ్యాధికి పూర్తిస్థాయి నివారణ లేకపోయినా, క్లాటింగ్ ఫ్యాక్టర్ ఇంజెక్షన్ల ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. హీమోఫీలియా ఎ(ఫ్యాక్టర్ ఎ××× లోపం), హీమోఫీలియా బి (ఫ్యాక్టర్ ×శ లోపం -- క్రిస్మస్ వ్యాధి) అనే రెండు రకాలున్నాయని వివరించారు.అలాగే హీమోఫీలియా ఉన్న వారు గాయాలు అయ్యే క్రీడలకు దూరంగా ఉండాలని, ఆస్పిరిన్ వంటి రక్తాన్ని పలచబరచే మందులు వాడకూడదని,దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రాన్ని దర్శించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు




**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 17:**కోనసీమలో ప్రసిద్ధి గాంచిన తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.పూజల అనంతరం ఎమ్మెల్యే రాధాకృష్ణ దంపతులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దుస్సాల్వతో వారిని సత్కరించారు .అదేవిధంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. వాడపల్లి క్షేత్రం రోజురోజుకు భక్తుల ఆదరణను పొందుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.



# కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో భక్తుల వెల్లువ -- పెరుగుతున్న ఆధ్యాత్మిక వాతావరణం





**స్వామివారినిచ్చి అన్నదానానికి భక్తులు విరాళం**


**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 17:**కోనసీమలో ప్రసిద్ధి గాంచిన వాడపల్లి క్షేత్రంలో కొలువై ఉన్న చందన స్వరూపుడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ క్షేత్రానికి భక్తుల రాకపోకలు గణనీయంగా పెరిగి, ఆలయ ప్రాంగణం నిత్యం ఆధ్యాత్మిక కాంతితో కళకళలాడుతోంది.భక్తులు స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని తమ కోరికలను కోరుకుంటూ ప్రత్యేక పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తి భావం ఉట్టిపడుతుండగా, వేద మంత్రోచ్చారణలతో ఆ ప్రదేశం మరింత పవిత్రంగా మారుతోంది.

ఈ సందర్భంగా రావులపాలెం మండలం, పొడగట్లపల్లి గ్రామానికి చెందిన కుంచనపల్లి వీర వెంకట సూర్యనారాయణ, బంగారు లక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులు స్వామివారికి భక్తి శ్రద్ధలతో రూ. 81,116/- విరాళంగా సమర్పించారు. వారి సేవను ఆలయ అర్చకులు ప్రశంసిస్తూ వేద మంత్రాలతో ఆశీర్వదించారు.అనంతరం ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు వారికి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి సన్మానించారు. భక్తుల విశ్వాసం, అంకితభావంతో వాడపల్లి క్షేత్రం రోజురోజుకూ మరింత ప్రాచుర్యం పొందుతోంది

# ర్యాలి గ్రామ వాకులమ్మ తల్లి తీర్థ మహోత్సవం







**అంగరంగ వైభవంగా సిరి బొమ్మ ఉత్సవం**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 17:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం ఆధ్యాత్మికోత్సాహంతో కళకళలాడింది. గ్రామ దేవతగా వెలసి ఉన్న వాగ్దేవి గ్రామ మహాలక్ష్మి (వాకులమ్మ తల్లి) తీర్థ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. తెల్లవారుజాము నుంచే భక్తజనాలు ఆలయానికి తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది.ఈ తీర్థ మహోత్సవానికి ప్రత్యేకమైన సాంప్రదాయం ఉంది. గ్రామమంతా పోతురాజును ఊరేగిస్తూ గ్రామ వీధులు మంగళవాద్యాలతో మార్మోగాయి. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న గ్రామస్తులు, యువకులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. సాయంత్రం వేళలో తీర్థం మధ్య భాగంలో ఏర్పాటు చేసిన సిరి బొమ్మ ఉత్సవం ఊపుతూ, పండ్లతో అలంకరించిన బొమ్మను కొట్టే ఆచారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ దృశ్యం గ్రామ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించింది.

భక్తులు అమ్మవారికి చలివిడి, పానకం, వడపప్పు వంటి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మహోత్సవంలో పాల్గొంటే కోరికలు నెరవేరుతాయని భక్తులలో బలమైన విశ్వాసం నెలకొని ఉంది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణాన్ని నిండుగా నింపడంతో పండుగ సందడి మరింత ఉత్సాహంగా మారింది.

ఆలయ చైర్మన్ నామాల శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తాగునీరు, ప్రసాదాల పంపిణీ, రద్దీ నియంత్రణ వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు.ఆలయ ఈవో బి. వెంకటరమణమూర్తి మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.మత్తంగా ర్యాలి గ్రామంలో జరిగిన ఈ వాకులమ్మ తల్లి తీర్థ మహోత్సవం భక్తి, సంప్రదాయం, గ్రామీణ సంస్కృతుల సమ్మేళనంగా నిలిచి, భక్తుల హృదయాల్లో చిరస్మరణీయంగా మిగిలింది.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జొన్నాడలో 'బడి పిలుస్తుంది'




**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 17;**మండలంలోని జొన్నాడలో బడి పిలుస్తుంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంపిపిఎస్ మెయిన్, స్పెషల్ పాఠశాలలు సంయుక్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎన్‌జిఒల ఆధ్వర్యంలో గ్రామ పాఠశాల ఆవరణ ప్రాంతంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి, బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను వారి గృహాల వద్ద కలిసి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించారు. అలాగే గుర్తించిన బడి ఈడు పిల్లలను జాయిన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిఆర్‌పి జి.శ్రీను, ఎన్‌జిఒ యాళ్ల ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో 984 మార్కులు సాధించిన హర్షిత -- విద్యపై పట్టు సాధించడమే లక్ష్యం

**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 17:**ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కొత్తపేట మండలానికి గర్వకారణంగా నిలిచింది విద్యార్థిని బొక్క హర్షిత.రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో కొత్తపేట మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన హర్షిత, రాజమండ్రి కాతేరు తిరుమల కాలేజీలో ఎం.పి.సి విభాగంలో చదువుతూ 1000 మార్కులకు గాను 984 మార్కులు సాధించి ప్రతిభ చాటింది.

పట్టుదల,క్రమశిక్షణతో చదువుకుంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని హర్షిత తన విజయంతో నిరూపించింది.ప్రతి రోజూ పాఠ్యాంశాలపై దృష్టి సారిస్తూ,సందేహాలను వెంటనే నివృత్తి చేసుకుంటూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే ఈ విజయాన్ని అందుకున్నట్లు తెలిపింది.విద్యపై పట్టు సాధించడం కోసం నిరంతర శ్రమ,ఆత్మవిశ్వాసం అత్యంత కీలకమని ఆమె పేర్కొంది.

భవిష్యత్తులో బీటెక్ పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించి ఇంజినీరింగ్ రంగంలో ప్రతిభ కనబరచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హర్షిత తెలిపింది.ఉత్తమ ఇంజినీర్‌గా గుర్తింపు పొందే వరకు కృషి చేస్తానని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువును కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేసింది.ఈ సందర్భంగా హర్షిత తల్లిదండ్రులు బొక్క లోకేష్,నాగరాణి,అలాగే అమ్మమ్మ, తాతయ్య,నానమ్మ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు,యువకులు హర్షితను అభినందిస్తూ ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హర్షిత సాధించిన ఈ విజయంతో గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ,విద్యపై పట్టుదలతో ముందుకు సాగాలనే సందేశాన్ని అందిస్తోంది.



## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాలాడి గోవిందరాజు”కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్, 17:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సి.ఎస్.ఇ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న”కాలాడి గోవిందరాజు “ పాండిచేరి యూనివర్సిటీ పాండిచేరి నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ. ప్రో ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాండిచేరి టెక్నాలజికల్ యూనివర్సిటీ కి చెందిన సి.ఎస్.ఇ విభాగం ప్రొఫెసర్ డా.ఎన్.శ్రీనాథ్ నేతృత్వంలో “కాలాడి గోవిందరాజు “

సమర్పించిన “థీసిస్ శీర్షిక:” ఏ సెక్యూరిటీ అండ్ ప్రైవసీ టెక్నిక్స్ బేస్డ్ ఆన్ నోడ్ ట్రస్ట్ అండ్ మెసేజ్ అథెంటికేషన్ ఇన్ ఫాగ్ – ఎనేబుల్డ్ వెహికలర్ అడహక్ నెటవర్క్ . “ అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు.”డా. కాలాడి గోవిందరాజు “ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి. డా.టి.సుధారాణి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది “కాలాడి గోవిందరాజు “కి అభినందనలు అందించారు.

## బడి పిలుస్తోంది కార్యక్రమం పై అధికారులతో సమీక్ష సమావేశం





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 17:**బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి కె హరికృష్ణ సత్యారెడ్డి కోరారు . స్థానిక మండల పరిషత కార్యాలయంలో

శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయాలతో సమావేశం నిర్వహించి బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుండి 23వ తేదీ వరకు జరపలిసిన రోజు వారి కార్యక్రమాలు జరిపి బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్చవలసిందిగా. మండల అభివృద్ధి అధికారి కోరారు.

5సం, వయసు నిండిన వారు మొదటి తరగతిలోకి 5 వ తరగతి ఉత్తీర్ణైన వారు ఆరవ తరగతిలోకి ప్రవేశాలు కల్పించాలని ప్రధానోపాధ్యాయులు ఉద్దేశించి మాట్లాడారు..

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె హెచ్ నాయక్ మరియు కే వెంకట్ రెడ్డి మండల ప్రధానోపాధ్యాయులు , మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి బిడ్డ పౌష్టికర ఆహారంపై శ్రద్ధ వహించాలి

- సూపర్వైజర్ నాగ పార్వతి



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,17:**తల్లి బిడ్డ పౌష్టికరమైన ఆహారంపై శ్రద్ధ వహించాలని సూపర్వైజర్ నాగ పార్వతి అన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధి నీలాద్రి రావు పేట గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ పార్వతి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు పౌష్టికారమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలకు జంక్ ఫుడ్ తినిపించవద్దని ఇంటిదగ్గర తయారు చేసిన ఆహారాన్ని పిల్లలకు తినిపించడం ద్వారా ఆరోగ్యం ఉంటుందని తెలిపారు . అలాగే స్క్రీన్ అనగా సెల్ ఫోన్లు టీవీలు అధికంగా వాడకం వల్ల కంటిచూపు సన్నగలుగుతుందని వాటికి దూరంగా పిల్లలను ఉంచాలని తెలియజేశారు. పిల్లలను కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో పెంచడం ద్వారా మంచి అలవాట్లు అలవర్చుకుంటారని పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా కుటుంబ సభ్యుల మధ్యనే పిల్లలు జీవించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికరమైన ఆహారం అర్హులైన లబ్ధిదారులకు ఇస్తున్నారు కనుక తప్పనిసరిగా లబ్ధిదారులు కేంద్ర వద్దకు వెళ్లి ఆహారాన్ని తీసుకుని అదే వాడాలని తెలియజేశారు. పురుషులు భాగస్వామ్యులై రాగు జావా, అటుకుల మిచ్చిరి, రాగి లడ్డు తయారు చేసి చూపించారు. డిస్ప్లే లో ఏర్పాటు చేసిన జంక్ ఫుడ్ వద్దు ఇంటి ఫుడ్ ముద్దు అన్న నినాదాలు అక్కడ, లబ్ధిదారులను ఆకట్టుకున్నాయి. అక్కడ వచ్చిన లబ్ధిదారులకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు కౌసల్య , నిర్మల, ఆయాలు రాఘవ , చింతాలమ్మ పిల్లలు తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు కొలతలను తప్పనిసరిగా సరిచూసుకోవాలి



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 17:**ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి

ఉపాధి కూలీలు పనిచేసేటప్పుడు సంబంధిత అధికారులు నిర్ణయించిన కొలతలను సరిచూసుకోవాలని స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. మండల పరిధి ఎర్రంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి కి తట్టుకునే విధంగా ఉదయం నుండి అధికారులు నిర్ణయించిన సమయాలను పాటిస్తూ కూలీలు పనులు నిర్వహించాలని సూచించారు. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## టీం ఆసుపత్రిలో ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం




**కాకినాడ, పెన్ పవర్, ఏప్రిల్ 17:** నాగమల్లి తోట వద్ద ఉన్న టీం ఆసుపత్రిలో ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ ఆదినారాయణ, దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17న ప్రపంచ హీమోఫీలియా దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు.ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచడం మరియు ముందుగానే గుర్తించి ప్రాణాపాయం నివారించడం అని చెప్పారు. హీమోఫీలియా ఒక జన్యుపరమైన రక్త రుగ్మతగా, ముఖ్యంగా పురుషులలో ఎక్కువగా కనిపిస్తుందని, సరైన జాగ్రత్తలు మరియు వైద్యుల పర్యవేక్షణతో బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని వివరించారు. రక్తం గడ్డకట్టడానికి అవసరమైన క్లాటింగ్ ఫ్యాక్టర్స్ లోపించడం వల్ల చిన్న గాయాలకే అధిక రక్తస్రావం జరుగుతుందని తెలిపారు.వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హీమోఫీలియా వ్యవస్థాపకుడు ఫ్రాంక్ ష్నాబెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు.డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న గాయాలకే రక్తం ఆగకుండా కారడం, కీళ్లలో నొప్పి, చిగుళ్ల నుండి రక్తస్రావం, శరీరంపై నీలి మచ్చలు కనిపించడం హీమోఫీలియా లక్షణాలని తెలిపారు.ఈ వ్యాధికి పూర్తిస్థాయి నివారణ లేకపోయినా, క్లాటింగ్ ఫ్యాక్టర్ ఇంజెక్షన్ల ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. హీమోఫీలియా ఎ(ఫ్యాక్టర్ ఎ××× లోపం), హీమోఫీలియా బి (ఫ్యాక్టర్ ×ఇ లోపం -- క్రిస్మస్ వ్యాధి) అనే రెండు రకాలున్నాయని వివరించారు.అలాగే హీమోఫీలియా ఉన్న వారు గాయాలు అయ్యే క్రీడలకు దూరంగా ఉండాలని, ఆస్పిరిన్ వంటి రక్తాన్ని పలచబరచే మందులు వాడకూడదని,దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపేటలో నేడు 5 గంటలపాటు విద్యుత్ నిలిపివేత



**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 17:**కొత్తపేట 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మత్తులు ,చెట్ల కొమ్మల నరికివేత (ట్రీ కటింగ్) పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు తెలిపారు.ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతకు గురయ్యే ప్రాంతాలు: కొత్తపేట టౌన్, సమితి రోడ్, కొత్తపేట బస్ స్టాప్, పలివెల గ్రామం, పలివెల వంతెన, గంటి గ్రామం, కండ్రిగ, అవిడి, కొత్తపాలెం, పెద్ద మెరక, చిన్న మెరక, వాడపాలెం, వాడపాలెం పెదపేట, మందపల్లి, కేదార్లంక, ఏనుగుమహల్ తదితర పరిసర ప్రాంతాలు.

పనులు సజావుగా పూర్తయ్యేందుకు వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. అవసరమైతే ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ పై చింతా అనురాధ హర్షం




- మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు :
- వైయస్.జగన్ పాలనలో మహిళలకు స్వర్ణయుగం

**అల్లవరం,పెన్ పవర్,ఏప్రిల్ 17:**చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుపై మాజీ పార్లమెంట్ సభ్యురాలు మహిళ విభాగం అధ్యక్షురాలు

చింతా అనురాధ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ నిర్ణయం భారత దేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి అని అనురాధ కొనియాడారు.

శుక్రవారం అల్లవరం మండలం మొగళ్ళమూరులోని స్వగృహంలో పత్రికా సమావేశంలో అనురాధ మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత లభించడం వల్ల సమాజంలో సమూల మార్పులు వస్తాయని ఆమె బలంగా విశ్వసిస్తున్నాశీ అన్నారు.బిల్లు మహిళల సాధికారతకు మరియు దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అనురాధ అభిప్రాయపడ్డారు.చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల వారి సమస్యలు నేరుగా చర్చకు వస్తాయని ఆమె తెలిపారు.మహిళలు నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఈ బిల్లు ఆ దిశగా ఒక బలమైన అడుగు అని అనురాధ పేర్కొన్నారు.వైయస్.జగన్ హయాంలో రాజ్యాంగం కల్పించిన దానికంటే తన రాజనీతితో మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అవకాశమివ్వడమే కాకుండా పదవుల్లో అంతకంటే ఎక్కువ అవకాశాలు కల్పించి 13 జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల్లో 7 గురి మహిళలకు అవకాశమిచ్చి 54 శాతం అవకాశమిచ్చారు. అదే విధంగా 26 జెడ్పీ వైస్ చైర్మన్ పదవుల్లో 15 మందిని నియమించడం ద్వారా 58 శాతం అవకాశమిచ్చారు.12 మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పోస్టులు తీసుకుంటే మొత్తం 36 పదవుల్లో 50 శాతం అంటే 18 పదవులు మహిళలకే ఇచ్చి అంతలా మహిళా సాధికారిత కోసం కృషి చేసిన వైయస్.జగన్ హయాంలో మహిళలు మహారాణుల్లా బ్రతికారు అని అనురాధ అన్నారు.

## ఆదిత్యలో ఘనంగా అక్కు వ్యవస్థాపక దినోత్సవం





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 17:**లక్ష్మీ నారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 20వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న లక్ష్మి పిలుపుమేరకు కళాశాలలో 20 మొక్కలను నాటినట్లు తెలిపారు. “మన వృక్షం -- మన భవిష్యత్తు” అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన వైస్ ఛాన్సలర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణహిత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని మరియు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా రాజమ్మ తల్లి జాతర మహోత్సవం





**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 17:** జగ్గంపేట సంత మార్కెట్ వద్ద వెలసి ఉన్న శ్రీ రాజమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై జాతరను తిలకించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 17:**గండేపల్లి గ్రామానికి చెందిన కాళ్ల జనార్ధన్ అనే యువకుడికి పెద్దాపురం కోర్టు వారు 14 రోజులు రిమాండ్ బిగించినట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు. వివరాలు ప్రకారం

గండేపల్లి గ్రామానికి చెందిన ఒక యువతి తను ప్రేమించిన అబ్బాయి పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఫ్యాన్కు ఉరివేసుకుని చనిపోయేలా ప్రేరేపించిన కాళ్ల జనార్ధన్ అనే యువకుడి నీ గండేపల్లి ఎస్సై శివ నాగబాబు దర్యాప్తు చేసి ముద్దాయిగా నిర్ధారించి దివి శుక్రవారం మధ్యాహ్నం గండేపల్లి గ్రామంలో ఆ యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం శ్రీ పెద్దాపురం జే ఎఫ్ సీఎం కోర్టుకు పంపగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించడం ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

## అగ్నిప్రమాదాల నివారణ, భద్రత పై అవగాహన సదస్సు



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 17:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆద్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణ మరియు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అగ్నిప్రమాదలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్ర అధికారులు ఇంచార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆర్.చంద్రశేఖర్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, ఫైర్ సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ మరియు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అగ్ని ప్రమాదాలు సంబావించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్మెంట్ ఉపయోగించి ప్రాక్టికల్ డెమో నిర్వహించారు.

## రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సప్లై కంపెనీ అండ్ సౌండ్ యూనియన్ లు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 17:** ఇటీవల కరెంట్ షాక్తో మృతి చెందిన బిరిసి రాజు కుటుంబానికి సప్లై కంపెనీ అండ్ లైటింగ్ సౌండ్ యూనియన్ లు ఆర్థిక సహాయం అందించాయి.

మండల పరిధి యర్రవరం గ్రామానికి చెందిన బిరిసి రాజు ఇటీవల కరెంట్ షాక్కు గురై మృతి చెందిన దుర్ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ నేపథ్యంలో ఆయన పెద్దకర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏలేశ్వరం మండలం సప్లై కంపెనీ సౌండ్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని వివిధ మండలాల సప్లై కంపెనీ సౌండ్ అసోసియేషన్ల ఓనర్లు కలిసి రాజు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం మండలం నుంచి రూ. 25,000, గొల్లప్రోలు మండలం నుంచి రూ. 25,000, కాకినాడ యూనియన్ నుంచి రూ. 10,000 అందజేయగా, సామర్లకోట, కాకినాడ, గండేపల్లి, జగ్గంపేట, తాళ్లరేవు, కాజులూరు, తొండంగి, పిఠాపురం, బిక్కవోలు, పెద్దాపురం మండలాల సభ్యులు కలిసి రూ. 33,500 రూపాయలను సహాయంగా అందించారు.

ఈ ఆర్థిక సహాయాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందజేసిన కార్యక్రమంలో ఏలేశ్వరం మండల సప్లై కంపెనీ సౌండ్ యూనియన్ అధ్యక్షుడు గూడవల్లి అర్జునరావు, ఉపాధ్యక్షుడు కోన బాబు, కార్యదర్శి గూడుపు కృష్ణ, ఖజాంచి బస్తా దుర్గబాబు , వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఇలాంటి విషాద సమయంలో అందరూ కలసి బాధిత కుటుంబానికి అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## సింహాద్రిపురంలో పోషణ పక్వాడ్ పై అవగాహన.





★ చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలి.

★ ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్,లక్ష్మి.

కిర్లంపూడి,పెన్ పవర్, ఏప్రియల్ 17 : పోషణ పక్వాడ్ లో భాగంగా కిర్లంపూడి మండలంలో సింహాద్రిపురం అంగన్వాడీ కేంద్రంలో జగ్గంపేట ఐసిడిఎస్, సీడీపీఓ,పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్,లక్ష్మి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

0-2 సంవత్సరాలపిల్లలు మెదడు అభివృద్ధి పై తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్పటి నుండి 3 సం. లు వయసు గల పిల్లలు లో 80% మెదడు అభివృద్ధి చెందుతుందని, పిల్లలు కు తల్లులు చిన్నప్పటి నుండి మంచి అలవాట్లు నేర్పాలన్నారు.ఆకు కూరలు, కూరగాయలు, పప్పు అలవాటు చేయాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పెట్టాలన్నారు. ఎక్కువ సమయం పిల్లలతో గడపాలి అని , చిప్స్, నూడుల్స్,డ్రింక్స్ పిల్లలకు పెట్టవద్దని వాటివల్ల చిన్న వయసులోనే గుండె జబ్బులు, రక్త పోటు వస్తుందని, అధిక బరువు పెరిగి మధుమేహం వచ్చే ప్రమాదం ఉందన్నారు. పిల్లలో ఏకగ్రత లోపం, మానసిక స్థితిలో మార్పులు వస్తాయన్నారు.

7 నెల లు నిండిన 3 వ సం వచ్చే వరకు అంగన్వాడీ కేంద్రం లో బాల మృతం ఇస్తున్నామని,ఇది పిల్లలు తినిపించాలని దానివల్ల పిల్లలో ఏకగ్రత ఉండడమే కాకుండా చురుకుగా ఉంటారన్నారు. సీడీపీఓ పూర్ణిమ

పురుషులతో పలు రకాల వంటలు చేయించారు. వంటలు చేసిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా గొల్లపల్లి బాలరాజేశ్వరికి ఆడపిల్ల పుట్టిన సందర్భంగా ఆమె పేరు మీద వారి ఇంటి వద్ద మొక్క నాటారు. ఈ కార్యక్రమం లో కాలపురెడ్డి పాపాయమ్మ, కాకిలేటి రాయుడు, కందా సత్యనందం, నంది. బాలకృష్ణ, కాకిలేటి బుజ్జి, కందా జియేశ్వరరావు,నంది రాజారావు సూపరవైజర్ సునీత, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్స్ పి గంగాదేవి ,సిహెచ్ హైమావతి,డి లోవకుమారి, బి భవాని, ఆశావర్కర్ లు గ్రామ పెద్దలు తల్లులు. పిల్లలు, పురుషులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఎంపిపి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 17;**మండలంలోని చింతలూరు ఎంపిపి పాఠశాలలో (గ్రాడ్యుయేషన్ డే) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా చింతలూరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంఇఒ-1 బి.అప్పాజీ, ఎంఇఒ-2 ఎన్.రాజు, పెదపళ్ల పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సాయికిషోర్, స్థానిక పెద్దలు నారాయణరావు హాజరయ్యారు. ఇందులో భాగంగా వక్తలు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య వలన ఉత్తమ ఫలితాలు సాధ్యమని తెలిపారు. మండపాక వెంకట రామ్మోహన్ జ్ఞాపకార్థం వారి కుమారుడు మండపాక యశ్వంత్ ఆర్థిక సౌజన్యంతో సమకూర్చిన మెడల్స్, ప్రశంసా పత్రాలను ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందించి అభినందించారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా స్నాతకోత్సవం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్పర్సన్ దుర్గాదేవి, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, సిఆర్ఎంటి అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ నిలిపివేత

**కాజులూరు, పెన్ పవర్ ఏప్రిల్ 17:**మండల పరిధిలోని పలు గ్రామాల్లో 18వ తేదీ,శనివారం33/11 కేవీ కాజులూరు సబ్స్టేషన్లో మరమ్మతుల పనులు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు క్రింది 11 కేవీ ఫీడర్స్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుంది.కాజులూరు,ఐతపూడి,
తిప్పరాజుపాలెం,ఒంటితాడి, కాబట్టి, సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరడమైనది.ఈ సమాచారాన్ని ఎన్. ఉదయ భాస్కర్ ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ ఆపరేషన్, ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ వారు తెలియజేశారు.

## స్వచ్ఛభారత్ లక్ష్యాలను నెరవేర్చేందుకు అందరూ కృషి చేయాలి: ఎంపీడీవో రామరాజు వర్మ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 17:** స్వచ్ఛభారత్ లక్ష్యాలను నెరవేర్చేందుకు అందరూ కృషి చేయాలని ఏలేశ్వరం ఎంపీడీవో రామరాజు వర్మ పిలుపునిచ్చారు. మండల పరిధి యర్రవరం గ్రామంలో ఎంపీడీవో, టిడిపి నాయకుడు బస్సా ప్రసాద్ లు స్వచ్ఛ భారత్ రథాన్ని శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ లక్ష్యంగా పనిచేస్తున్నాయని, దీనిలో భాగంగానే స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేశాయని వర్మ తెలిపారు.గ్రామంలో పలువురు స్వచ్ఛ రథం వద్ద డ్రై వేస్ట్ అందించిన ప్రజలు నిత్యవసర సరుకులు పొందారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వర్మ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యము పై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని దానిలో భాగంగా డ్రై వేస్ట్ పొడి చెత్త సేకరించే దిశగా కూటమి ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేసిందని అన్నారు.మండల వ్యాప్తంగా రోజుకి ఒక ఊరు చొప్పున ఈ స్వచ్ఛ రథం చెత్త సేకరణ చేపడుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు తమ పొడి చెత్తను ఐరన్, ప్లాస్టిక్,అట్ట తదితర వేస్టును ఈ స్వచ్ఛ రథం వద్దకు తెచ్చి కేజీకి నిర్ణయించిన ధరలకు విక్రయించవచ్చని తెలిపారు. ఐరన్ ప్లాస్టిక్ కేజీ ఒక్కరికి 20 రూపాయలు చొప్పున,అట్ట కాగితాలు కు ఒక కేజీకి15 రూపాయలు చొప్పున నిత్యవసర సరుకులు ఈ రథం దగ్గర ఇవ్వబడతాయని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లల్లో పొడి చెత్తను స్వచ్ఛ రథం వద్ద అందించి నిత్యవసర సరుకులు పొందాలని ఎంపీడీవో సూచించారు.

## మర్రివీడు లో భూముల రీ సర్వే పై గ్రామసభ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 17:** మరి వీడు గ్రామంలో భూముల రీ సర్వే పై రెవెన్యూ అధికారులు గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. స్థానిక నాయకులు రైతులతో గ్రామంలో ర్యాలీ చేపట్టిన రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభకు ఏలేశ్వరం మండల తహసిల్దార్ కె. కుసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఈ గ్రామసభ ద్వారా గ్రామంలో ఉన్న రైతులకు తమ పంట పొలాల హద్దులను తదితర అంశాలను ఈ సర్వేలో పొందుపరచుకోవాలి అన్నారు. రైతులకు తమ భూముల హద్దులు తదితర అంశాలపై ఉన్న సమస్యలను రీ సర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.రీసర్వే అనంతరం ఇప్పటివరకు ఉన్న సర్వేనెంబర్ అనుసంధానంగా ఎల్పిఎం నెంబర్ నమోదు అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నీలి సత్యనారాయణ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రైతులు తమ తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని, రీ సర్వే కు వచ్చిన అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సివిల్ సప్లయ్ అధికారి రవి, రెవెన్యూ శాఖ అధికారులు,కూటమి నాయకులు బుజ్జి బాబు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బూరుగుపూడిలో ఘనంగా జ్యోతుల నవీన్ 50 వ పుట్టినరోజు వేడుకలు



**కిర్లంపూడి,పెన్ పవర్, ఏప్రియల్ 17:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కిర్లంపూడి మండలం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కుంచే తాతాజీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ 50 వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ మా అభిమాన యువనేత నవీన్ 50వ పుట్టినరోజు సందర్భంగా బూరుగుపూడి టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు అందరం కలిసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు.తండ్రికి తగ్గ తనయుడిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా, కాకినాడ జిల్లాలో టిడిపిని సమర్ధవంతంగా నడిపిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల మన్ననలు పొందుతున్న మా నాయకుడు నిండు నూరేళ్లు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుంచే శ్రీనివాస్, బాలిన వెంకటేశ్వరరావు, సోము పుచ్చయ్య, పాఠంశెట్టి బాబ్జి, పాఠంశెట్టి మీసాల నాగేశ్వరరావు,రామిశెట్టి రాజు, పాఠంశెట్టి కొండరాజు లు, కర్నాకుల రామకృష్ణ, మురా సత్తిబాబు, కడెంశెట్టి నాగేశ్వరరావు, బాలుకుల చిన్నోడు, పాఠంశెట్టి తమ్మారావు, బాలిన ఎర్రి బాబు, గురజాల సత్తిబాబు, దాయం మణికంఠ, కర్నాకుల వీరబాబు, పాఠంశెట్టి రాంబాబు, మీసేవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరావులమ్మ అమ్మవారి తీర్థం

- ఆకట్టుకున్న గవ్వ నృత్యం
- ప్రత్యేక అలంకరణలో శ్రీరావులమ్మ తల్లి



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 17;**మండలంలోని సంధిపూడి లో వేంచేసియున్న శ్రీరావులమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ఆవరణలో ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారాణలతో కూడిన దండకాన్ని చదువుతుండగా గ్రామ మహిళలు పిండివంటలతో తయారుచేసిన నైవేద్యాన్ని సమర్పించారు. పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేసి, కాగడాలు వెలిగించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఆసాద కళాకారుడు నెత్తిన గరగను ధరించి చర్మ వాయిద్యాల శబ్దాలు మధ్య నిర్వహించిన గవ్వ నృత్యం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. కడియపులంక నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించిన తీరు భక్తులను అలరించింది. అలాగే గత వారం రోజుల నుంచి రాత్రి వేళల్లో జరుగుతున్న జాగరణ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు యావత్ ప్రజానికాన్ని అద్భుతంగా ఆకట్టుకుంది. బాణాసంచా కాల్పులు అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

# పోషణ పక్వాడ ద్వారా పురుషులకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై అవగాహన



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 17;** ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపిఒ గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలో అంగన్వాడి కేంద్రం వద్ద శుక్రవారం రాష్ట్రీయ 8వ పోషణ పక్వాడ ద్వారా పురుషులకు ఆరోగ్యకరమైన సాంప్రదాయ ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పురుషులు కూడా వంట పోటీలలో పాల్గొని సాంప్రదాయ పోషకాహార వంటకాలను తయారు చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ గర్భవతిగా నిర్ధారణ అయినప్పటి నుంచి బిడ్డపుట్టి రెండు సంవత్సరాలు నిండే వరకు వేయి రోజుల పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం, సంరక్షణ పట్ల గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.రెండు సంవత్సరాల లోపు పిల్లల మెదడు అభివృద్ధి దృష్ట్యా మొబైల్, టీవీ వంటి స్క్రీన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. అలాగే గృహాల వద్ద జంక్ ఫుడ్లు సప్లై చేసేది పురుషులే కాబట్టి వాటిని నిషేధించేలాగా మహిళలు అవగాహన కల్పించాలని, అలాగే ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడీ-టు-కుక్, రెడీ-టు-ఈట్ ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి, ఇంటి వంట సాంప్రదాయ సహజ ఆహారాన్ని ప్రోత్సహించాలన్నారు. అధిక సోడియం, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు కలిగిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని పురుషులకు వివరిస్తూ హెచ్చరించారు.చిప్స్, కుర్కురే వంటి జంక్ ఫుడ్స్‌కు బదులుగా శెనగలు, పప్పులు, పల్లీలు, పాప్‌కార్న్, పండ్లు వంటి ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను వినియోగించాలని సూచించారు. అనంతరం సూపర్వైజర్ అంగన్వాడి సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించి, బాల్యం నుండి యుక్త వయసుకు వచ్చిన చిన్నారుల వద్ద ఉపయోగంలో లేని ఆట వస్తువులను సేకరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పార్వతి, లక్ష్మి, ఆదిలక్ష్మి, జానకి రాణి, ఆదిలక్ష్మి, సుజాత, చంటి బిడ్డ తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో పోషణ పక్వాడపై అవగాహన కార్యక్రమం.

-ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిడి,సిహెచ్ లక్ష్మి,కెవిఐబి వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఏప్రియల్ 17:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి,ఖాదీ చిన్న తరహా పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ప్రముఖ న్యాయవాది బుగతా శివ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఐసిడిఎస్ ప్రత్తిపాడు సెక్టార్ అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించిన ఈ పోషణ పక్వాడ కార్యక్రమంలో గర్భిణీలు,బాలింతలు,ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సూపర్ దేలో చిన్నారి తండ్రులను భాగస్వామ్యం,ప్యాకెట్ మరియు సంప్రదాయ చిరుతిళ్లు మధ్య తేడా,ఆట బొమ్మల సేకరణ ద్వారా చిన్నారులను ఉత్తేజంపజేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు.పిల్లల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యత వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందని ఆరు సంవత్సరాల వయసు వచ్చేసరికి మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు అలవాట్లు స్క్రీన్,టీవీ మొబైల్ ఫోన్లకు మరియు ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.చిన్నారుల తాత, అమ్మమ్మ,నాయనమ్మలు చెప్పే మంచి మంచి కథల ద్వారా వాళ్లకు మెదడు అభివృద్ధి ప్రక్రియలో దోహదపడాలని సూచించారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు.మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.చిన్నారుల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యతలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు,ఏపీఎం జి శ్రీనివాసరావు,ప్రత్తిపాడు జగ్గంపేట సిడిపివోలు టిడిఆర్ పద్మావతి,యం పూర్ణిమ,కూటమి నాయకులు మూరా చంటిబాబు, గోపి, సూపర్వైజర్లు వరలక్ష్మి,సూర్యకుమారి,చక్రవేణి, మంగా రత్నం,సునీత,ఐసిడిఎస్ టీచర్లు, హెల్పర్లు, పలువురు గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# ఈనెల 30 వరకు జాతీయ ఎస్ సి కులాల ఆర్థిక రుణాలపై వడ్డీ మాఫీ కి గడువు



జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ సీఈఓ జె. సత్యవతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 17:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ విభాగం ద్వారా జారీ చేసిన ప్రకారం జాతీయ ఎస్ సి కులాల ఆర్థిక పథకాల కింద రుణాలు పొందిన లబ్ధిదారులకు వడ్డీ మాఫీ సదుపాయం కల్పించనునట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు జె. సత్యవతి శుక్రవారం తెలిపారు.

ఈ ఉత్తర్వుల మేరకు, రుణగ్రహీతలు తమ బకాయి అసలు మొత్తాన్ని 30-04-2026 లోపు పూర్తిగా చెల్లించినట్లయితే, వారి రుణ ఖాతాల్లో 31-12-2025 వరకు నమోదైన వడ్డీ మొత్తాన్ని పూర్తిగా మాఫీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సదుపాయం పొందేందుకు ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఏప్రిల్ 30, 2026 మాత్రమేనన్నారు . ఆ తర్వాత ఈ వడ్డీ మాఫీ అవకాశం రద్దు అవుతుందనీ తెలిపారు. తదనంతరం రుణ గ్రహీతలు అసలు మొత్తంతో పాటు వడ్డీని కూడా పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు తేదిలోపు తమ బకాయి అసలు మొత్తాన్ని చెల్లించి వడ్డీ మాఫీ ప్రయోజనం పొందాలని కార్యనిర్వాహక సంచాలకులు కోరారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో కుటుంబ దత్తత కార్యక్రమం విజయవంతం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 17:**స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎం బి బి ఎస్ విద్యార్థులచే నిర్వహించిన కుటుంబ దత్తత కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ , కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గ ప్రసాద్ లు విజయవంతంగా నిర్వహించినట్లు జి జి హెచ్ వర్గాలు శుక్రవారం తెలియ చేశారు. లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వర నగర్ వాంబే కాలనీ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక కుటుంబాలను సందర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన విధానం, పోషకాహారం, పారిశుద్ధ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు సమాజంతో మమేకం , ఫీల్డ్ స్థాయిలో ప్రాక్టికల్ అనుభవం , ప్రజారోగ్య సమస్యలను అర్థం చేసుకోవడం వంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. భావ వినిమయంలో మాట్లాడటం, వినడం రాయడం, బాడీ లాంగ్వేజ్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు.స్థానిక ప్రజలు సానుకూలంగా స్పందించి సహకరించారు. సాంకేతిక మార్గదర్శకత్వాన్ని నోడల్ ఆఫీసర్ డా. ఆర్. సురేంద్రబాబు అందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. దీప్తి, డా. ప్రశాంత్, సీనియర్ రెసిడెంట్లు, , అద్దేపల్లి కాలనీ - నారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా. శిరీష , ఏ ఎన్ ఎం లు , ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు




- మోరంపూడి ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు,
- రైల్వే స్టేషన్ అభివద్ధి పట్ల నిర్లక్ష్య ధోరణి
- మద్యం, ఇసుక, కబ్జాలతో దోచుకుంటున్న ఇవిఎం ఎమ్మెల్యే
- మీడియా సమావేశంలో మాజీ ఎంపి, మార్గాని భరత్ రామ్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 17** :దేశంలో మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం చారిత్రాత్మకమని పార్లమెంట్ మాజీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక సిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో భరత్ రామ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ లో 2023 లోనే వచ్చిందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం కానున్న దశలో మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రభుత్వంలో వేలాది మంది మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేశామని, ప్రభుత్వం మారడం తో ఆ పట్టాలను లబ్ధిదారులకు అందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే 3 సెంట్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని రెండేళ్ళు గడిచినా ఆ ఊసే లేదన్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివద్ధికి భారత్ అమృత పథకంలో మంజూరు చేయించామని, రెండేళ్ళు గడిచినా అభివద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే స్టేషన్ అభివద్ధికి రూ.270 కోట్లతో డిజైన్‌లు కూడా వేయించామని, ప్రధాని మోదీ వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. బొమ్మూరు, దివాన్ చెరువుతో సహా నాలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జిలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కూడా మంజురు చేయించామని ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. మోరం పూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఇవిఎం ఎమ్మెల్యే సర్వీసు రోడ్డు వేయించ. లేకపోయారన్నారు. ఇసుక, మద్యం, కబ్జాలతో ఇవిఎం ఎమ్మెల్యే దోచుకోవడం తప్ప అభివద్ధిపట్ల దృష్టి లేదన్నారు. కోటిలింగాల ఘాట్ వద్ద నుండి హితకారిణి చైర్మన్‌ను పెట్టి ఇసుకను దోచుకుంటున్నారని నది గర్భంలో యదేచ్ఛగా డ్రెడ్జింగ్ చేస్తున్నారని ఆరోపించారు. రెండేళ్ళుగా సర్వీస్ రోడ్డులు వేయని ఇవిఎం ఎమ్మెల్యే ఫ్లెక్సీలపై పేడ కొట్టాలని మండిపడ్డారు. రూరల్ , సిటీ ఎమ్మెల్యేలు , ఎంపి బాధ్యత తీసుకుని సర్వీస్‌రోడ్డులు వేయాలన్నారు. రివర్ ఫ్రంట్‌కు రూ.88 కోట్లు, ఎయిర్‌పోర్టుకు రూ.340 కోట్లు నిధులు తీసుకువచ్చిది కూడా తానేనన్నారు.

**యువతకు ఉపాధి కోసం 18న జాబ్‌మేళా ...**

నిరుదోగ్య యువతకు ఉపాది కల్పించే లక్ష్యంతో ఈనెల 18వ తేదీ శనివారం స్థానిక మార్గాని ఎస్టేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు మాజీ ఎంపి భరత్ రామ్ తెలిపారు. ప్రతి ఏటా జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా కనీసం 2,3వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగులు హాజరయ్యి, జాబ్‌మేళాను సద్వియోగం చేసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) వాసంశెట్టి గంగాధరరావు, నాయకులు దాసి వెంకట్రావు, పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మి, మార్తి నాగేశ్వరరావు, తిరగటి దుర్గా, గారా చంటిబాబు, బిల్డర్ చిన్న, , నల్లా రామాంజనేయులు, ఆరే చిన్ని, రేగుళ్ళ బాల శ్రీధర్, కే అనురాధ, గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కొత్త ఈసీగా అనిల్ చంద్ర పునేతా ?

**విజయవాడ, ఏప్రిల్ 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేతా నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ పోస్ట్‌కు పునేతా పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పునేతా నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే గవర్నర్ ద్వారా నియామక ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు సమాచారం. పునేతా 2019 ఎన్నికలకు ముందు అప్పటిటీడీపీ ప్రభుత్వ హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల సంఘం ఆయన్ను సీఎస్ పోస్టు నుంచి తప్పించగా.. ఆ తర్వాత ఆయన రిటైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను విజిలెన్స్ కమిషనర్‌గా నియమించారు. తాజాగా ఎన్నికల కమిషనర్‌గా పునేతా సేవల్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నీలం సాహ్ని పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగిసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో పునేతాకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పునేతా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా బాధ్యతలు అప్పగిస్తే.. విజిలెన్స్ కమిషనర్‌గా మరో రిటైర్డ్ ఐఏఎస్, మాజీ సీఎస్ నీరభ్ కుమార్‌ను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.అనిల్ చంద్ర పునేతా సొంత రాష్ట్ర ఉత్తరాఖండ్. ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన.. రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చదివారు. ఎల్ఎల్‌బీ కూడా పూర్తి చేశారు. 1984 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన పునేతా.. కడప జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ద్వారా ఐఏఎస్ అధికారిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఆయన వరుసగా మూడుసార్లు ఉత్తమ కలెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, భూపరిపాలన ప్రధాన కమిషనర్ గా,

ఉద్యాన, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ ఆయన పనిచేశారు2018 సెప్టెంబర్‌లో నాటి టీడీపీ ప్రభుత్వం అనిల్ చంద్ర పునేతాకు సీఎస్‌గా బాధ్యతల్నిఅప్పగించింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఇంటెలిజెన్సీ డీజీ బదిలీ విషయంలో ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం చేశారనే కారణంతో.. చీఫ్ సెక్రటరీ పదవి నుంచి ఆయన్ను తప్పించింది. ఎల్వీ సుబ్రహ్మణ్యంను నూతన సీఎస్‌గా నియమించింది. ఆ తర్వాత పునేతా ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గానూ ఆయన పని చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెరుచుకోనున్న ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్

**కాకినాడ, ఏప్రిల్ 17, పెన్ పవర్:** కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.. వాకలపూడి సెజ్‌లో ఉన్న రిఫైనరీ ప్లాంట్‌ను మూసివేస్తున్నట్లు కార్మికులకు సమాచారం ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో పాటుగా ఇతర శాఖల అధికారులకు మెయిల్ ద్వారా తెలిపారు. నష్టాలు రావడంతో కంపెనీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. యూనిట్ ప్రారంభించిన దగ్గర నుంచి వరుసగా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని చెబుతున్నారు. విదేశాల నుంచి ముడి చక్కెర ఈఐడీ ప్యారీ కంపెనీ అనుబంధ సంస్థ పీఎస్ఆర్ఐపీఎల్ (ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్) ప్లాంట్‌కు దిగుమతి అయ్యేది. ఈ ముడి చక్కెరను ప్లాంట్2లో శుద్ధి చేసి మళ్లీ ఎగుమతి చేసేవారు. ఈ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి ఇబ్బందుల్ని ఎదురవుతున్నాయి. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.1406 కోట్ల నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ బోర్డు సమావేశంలో ప్లాంట్ మూసివేయాలని డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, పరిశ్రమలు, ఇతర శాఖలకు సమాచారం ఇచ్చారు.. ప్లాంట్‌కు కాంట్రాక్ట్ కార్మికులు రావొద్దని చెప్పారు.వాకలపూడి సెజ్‌లో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన యూనిట్‌ను ప్రారంభించారు. ముందు ఈ ప్లాంట్‌ను గ్యాస్‌తో నడిపించాలని ప్లాన్ చేసినా.. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో బొగ్గుతో నడిపించాల్సి వచ్చింది.. ఈ మౌలిక సదుపాయాల కోసం అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. 2015–2016లో ఈ యూనిట్‌లో ప్రొడక్షన్ మొదలైంది..
ప్రారంభంలో రోజుకు రెండే వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటే.. దానిని 3వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని భావించారు.కానీ మూడు వేల మెట్రిక్ టన్నులకు ప్రయత్నించినా ఫలితం లేకుండా
పోయింది.. ఆర్థికంగా కూడా నిలదొక్కుకోలేకపోయారు. అలాగే పలు కారణాలతో 2021నుంచి 2022 వరకు రెండు నెలల పాటూ ప్లాంట్‌లు పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత 2022 నుంచి
2023లో వరుసగా ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్లాంట్‌ను నెల రోజులకు పైగా మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. షిప్పుల్లోకి లోడింగ్ కూడా ఆలస్యం కావడంతో భారీ జరిమానాలు చెల్లించడం
ఇబ్బందిగ మారింది. వీటికి తోడు మార్కెట్‌లో చక్కెర ధరలు కూడా తగ్గడంతో మరిన్ని నష్టాలు వచ్చాయి. ఓవైపు రుణభారం కూడా పెరగడంతో యూనిట్‌ను నడపడం లాభదాయకం కాదని భావించారు.
అందుకే ఈ యూనిట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం మీద నష్టాల కారణంగా కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.

# విశాఖపట్నం టు భోగాపురం ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ప్లాన్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 17, పెన్ పవర్:** భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.. అన్నీ కుదిరితే జులై, లేని పక్షంలో ఆగస్టు నెలలో ప్రారంభించే అవకాశం ఉంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖపట్నంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్‌ను నేవీకి అప్పగించనున్నారు. అప్పుడు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు పెరుగుతాయి. అయితే ఆనందపురం దగ్గర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటంతో కొత్తగా ఫ్లై ఓవర్ ప్లాన్ చేశారు.. అలైన్‌మెంట్ ఫైనల్ చేసి డీపీఆర్ కోసం పంపారు.విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికి కీలకమైన ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.ఈ క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గ్రహించి ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టే దిశగా ఆలోచన చేశారు. ఆనందపురం జంక్షన్ మీదుగా.. విశాఖపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు.. అటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఆనందపురం జంక్షన్ దగ్గర భోగాపురం వైపు వెళ్లేలా కొత్తగా ఓ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం వచ్చిన సమయంలో కొత్త ఫ్లై ఓవర్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనలకు సీఎం ఓకే చెప్పడంతో అధికారులు ఈ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 45 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేసి.. ఆమోదం రాగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఇటీవల ఆనందపురం జంక్షన్, కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌లను ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. ప్రస్తుతం ఆనందపురం జంక్షన్ దగ్గర ఉన్న మార్కెట్‌ను మరోచోటికి తరలించాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను తరలిస్తే.. రాబోయే రోజుల్లో ఆనందపురం జంక్షన్ దగ్గర భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంశంపై కూడా ఫోకస్ పెట్టిన అధికారులు.. శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇటు అనకాపల్లి వెళ్లే వాహనాలు, అటు భోగాపురం వైపు వెళ్లే వాహనాలకు ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.మరోవైపు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ ఉ బీ శాఖలు ఈ రోడ్ల పనులు జరుగుతున్నాయి. విశాఖపట్నం ఎంపీ భరత్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్‌లు ఈ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. తిమ్మాపురం నుంచి మారికవలస రోడ్డు రహదారి పనులు ముగింపు దశకు వచ్చాయని ఎంపీ భరత్ తెలిపారు. అడవివరం నుంచి శొంఠ్యాం ఆరు లేన్ల రోడ్డుకు అనుమతులు వచ్చాయని.. ఆ పనులు ఊపందుకున్నాయన్నారు. నేరళవలస––కొత్తవలస, బోయపాలెం––కాపులుప్పాడ రహదారులు ఏప్రిల్ చివరినాటికి పూర్తవుతాయన్నారు.పెందుర్తి ప్రాంతంలోని రోడ్డు పనులు మే––జూన్ నాటికి పూర్తి చేసే అవకాశం ఉందని భరత్ తెలిపారు. భీమిలి టు దొరతోట రోడ్డును 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ రోడ్లను నేషనల్ హైవేలతో అనుసంధానానికి ఇప్పటికే అనుమతులు లభించాయన్నారు. జూన్ నాటికి విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఏడు కీలకమైన రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# చంద్రబాబు స్కెచ్...

**విజయవాడ, ఏప్రిల్ 17 పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీకి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేష్ నియమితులయ్యారు. నిన్ననే తెలుగుదేశం పార్టీ కమిటీలను సమూల ప్రక్షాళన చేసి ప్రకటించారు. సీనియర్లతోపాటు జూనియర్లకు ఎక్కువగా అవకాశాలు ఇచ్చారు. ప్రధానంగా లోకేష్ ఎంపిక వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతానికి పార్టీపై పూర్తి పట్టు సాధించారు లోకేష్. ఈ తరుణంలో తరచు లోకేష్ సీఎం అనే మాట బయటకు వస్తోంది. మరోవైపు చంద్రబాబు యాక్టివ్ గానే ఉన్నారు. మరోసారి ఆయన ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆరోగ్యంతో పాటు వయసు సహకరిస్తుంది. ఎందుకంటే ఆయన పూర్తి ఫిట్నెస్ కు ప్రాధాన్యమిస్తారు. మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఏపీని ఒక రూపంలోకి తేవాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. అయితే జాతీయ స్థాయిలో సమన్వయం ఇప్పుడు ఏపీ ప్రభుత్వానికి అవసరం. ఆ అవసరం దృష్ట్యా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లోకేష్ కు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.ప్రధానంగా మంత్రి లోకేష్ ఏపీ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సీఎం చంద్రబాబు పాలన పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాతో పాటు గ్రామీణ అభివృద్ధి పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ పరిస్థితుల్లో మంత్రి లోకేష్ విదేశీ పెట్టుబడులపై ఎక్కువగా ఫోకస్ చేశారు. అందులో సక్సెస్

# పిఠాపురానికి మహర్దశ




**కాకినాడ ఏప్రిల్ 17, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం పిఠాపురం నియోజకవర్గానికి తీపికబురు చెప్పింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం మున్సిపాలిటీ హోదా సెలక్షన్ గ్రేడ్‌కు పెరిగింది.. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పిఠాపురం మున్సిపాలిటీకి సంబంధించి హోదా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను పరిశీలించి సెలక్షన్ గ్రేడ్‌కు హోదా పెంచేందుకు ఆమోదం తెలిపారు. పిఠాపురానికి సెలక్షన్ గ్రేడ్ హోదా రావడంతో అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి ఏపీ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పిఠాపురం మున్సిపాలిటీ ని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పిఠాపురం మున్సిపాలిటీ కౌన్సిల్, స్పెషల్ ఆఫీసర్ చేసిన ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపించారు. పిఠాపురం మున్సిపాలిటీకి 2021 నుంచి 2025 వరకు వచ్చిన ఆదాయం, వ్యయం వివరాలను పరిశీలించారు. అనంతరం సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలియజేయడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి.పిఠాపురానికి 1957లో మున్సిపాలిటీ హోదా వచ్చింది.. అయితే జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం 30 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 55వేలమంది వరకు ఉండగా.. ఆ తర్వాత జనాభా సంఖ్య భారీగా పెరిగింది. అలాగే పిఠాపురం ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉంది.. ఇక్కడ పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, స్వయంభూ శ్రీపాద వల్లభుడి ఆలయం, కుంతీమాధవస్వామి ఆలయాలు ఉన్నాయి. పిఠాపురంలోని ఆలయాలకు భక్తులు భారీగా తరలివస్తుంటారు.. దీంతో ఆదాయం కూడా పెరిగింది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు చొరవ తీసుకున్నారు. అధికారులు ప్రతిపాదనలు పంపగానే ఆమోదం తెలిపి సెలక్షన్ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ సెలక్షన్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో.. త్వరలో ఇక్కడ గ్రూప్–1 అధికారిని కమిషనర్‌గా నియమించనున్నారు. హోదా పెరగడంతో మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉంది. ఇటు [illegible] రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు కూడా వచ్చే అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు మంచి అవకాశం వస్తుంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం పిఠాపురం అభివృద్ధి కోసం పిఠాపురం
ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.. తాజాగా పిఠాపురం మున్సిపాలిటీకి సెలక్షన్ గ్రేడ్‌గా మార్చారు.ఏదైనా మున్సిపాలిటీకి వార్షిక ఆదాయం రూ. 8 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే కనుక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలకు సంబంధించి వివరాలను పరిశీలించి ప్రభుత్వం హోదాను పెంచుతుంది. అంతేకాదు ఈ మున్సిపాలిటీలలో జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్య 20 నుంచి 50 వరకు ఉండొచ్చు. ఏపీ ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీల గ్రేడ్‌ను పెంచింది.. ఇప్పుడు పిఠాపురం మున్సిపాలిటీ గ్రేడ్ కూడా పెంచారు. అంతేకాదు ఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కిందకు తీసుకువచ్చింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదనలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. 37.25 కోట్ల రూపాయలతో పిఠాపురం రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు అన్నీ పూర్తి అయితే పిఠాపురం రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ పిఠాపురంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అశుభ్రత, దుర్గంధంతో ఉండటాన్ని పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను తక్షణం శుభ్రం చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు.అనంతరం ఈ ఏడాది జనవరి నెలలో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్ కళ్యాణ్.. పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన పవన్ కళ్యాణ్.. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమైన పిఠాపురానికి సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని.. వారి సౌకర్యం కోసం పిఠాపురం రైల్వ?్వ స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అభివృద్ధి చేయాలని రైల్వే మంత్రిని పవన్ కళ్యాణ్ కోరారు.

# బలమైన వ్యూహంతో కమలం

**విజయవాడ ఏప్రిల్ 17, పెన్ పవర్:** బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో బలంగా ఉంది. ప్రజా క్షేత్రంలో బలంగా లేకపోయినప్పటికీ అన్ని బలమైన ప్రాంతీయ పార్టీలతో కమలం పార్టీకి అవగాహన ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకివచ్చినప్పటికీ బీజేపీ అధికారంలోకి వచ్చినట్లే. ఎందుకంటే టీడీపీతో నేరుగా అలయన్స్ లో ఉంటే పార్లమెంటు స్థానాలు, శాసనసభ స్థానాల్లో తమ పార్టీకి ప్రాతినిధ్యం ఉంటుంది. అందుకే టీడీపీ, జనసేనతోఅలయన్స్ ను బీజేపీ గత ఎన్నికలకు ముందు కుదుర్చుకుంది. అదే తెలంగాణలో బీజేపీ బలంగా ఉండటంతో పాటు సెంటిమెంట్ కారణంతో ఆ కూటమి తెలంగాణలో ఏర్పాటు కాలేదు.మాజీ పార్లమెంటుసభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కానీ, వైసీపీ కాని అధికారంలో ఉంటే అది బీజేపీ కూడా అధికారంలో ఉన్నట్లే లెక్క అనుకోవాలి అన్న మాట అక్షర సత్యం. ఏపీలోబీజేపీకి ప్రత్యర్థిపార్టీ అనేది లేదు. ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు లేదు. రాష్ట్ర విభజన కారణంగా ఏపీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారు. అది బీజేపీకి వరంగా మారింది.అందుకే ఏపీలో ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ పెద్దగా రాజకీయంగా ఇబ్బంది ఉండదన్నది వాస్తవం. అందుకే ఏపీలో పార్టీని బలోపేతం చేయడంపై కూడా పెద్దగా నేతలు ఫోకస్ పెట్టడం లేదన్నవాదనలు కూడా ఉన్నాయి.బీజేపీ కేంద్ర నాయకత్వానికి ఏపీ ఒక్కటే ముఖ్యం కాదు. దేశంలో అన్ని రాష్ట్రాలు ముఖ్యం. ప్రధానంగా తాము బలంగా ఉన్న రాష్ట్రాల్లో మరింత బలపడాలంటే అక్కడ ఎక్కువనిధులు కేటాయించాలి. అలాగే ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు ఇవ్వాలి. అప్పుడే అక్కడ మరింత బలోపేతం అవుతామన్నది బీజేపీ ఆలోచన. బీజేపీకే కాదు.. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీనాయకత్వం ఆ విధంగానే ఆలోచిస్తుంది. బీజేపీ తప్పిదం ఇందులో ఏమాత్రం లేదు. బీజేపీ 2029 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్ లో బలోపేతం చేసుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించే అవకాశాలనుకొట్టిపారేయలేం. ఎందుకంటే తమకు ఉత్తరాదిన ఉన్న బలం సరిపోతుంది. అలాగని ఉత్తరాదితో సరిపెట్టుకోకుండా.. దక్షిణాదిన కూడా



ప్రాంతీయ పార్టీలను బలహీన పర్చి, తాను బలపడేందుకు ప్రయత్నిస్తుందన్నది విశ్లేషకుల అంచనా. అందుకే బీజేపీకి ఎటు చూసినా ఏపీ విషయంలో లక్కు ఉన్నట్లే కనిపిస్తుంది.
ఫ్యాన్ పై విమర్శల వెల్లువఏపీ లో రాజకీయ పార్టీలు అన్నీ ఒక తాను ముక్కలే. టీడీపీ ఎటూ ఎన్డీఏ భాగస్వామి. అందుకే దానిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. పార్లమెంటు లో ఏ బిల్లు పెట్టినప్పటికీ టీడీపీ ఖచ్చితంగా మద్దతుతెలపాల్సిందే. కానీ వైసీపీ ఏపీలో ప్రతిపక్షంలో ఉంది. ఒక రకంగా చెప్పాలంటే గత ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఎదుర్కొని అది 11 స్థానాలకు పరిమితమయింది. అలాంటి వైసీపీ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించేప్రతి బిల్లుకు ఆమోదం తెలుపుతూ.. తలాడిస్తూ ఉండటం.. బీజేపీకి అండగా నిలుస్తుంది. ఇది రాజకీయంగా వైసీపీకి కొంత నష్టం చేకూరుస్తుందన్నది అందరి వాదన. పొరుగున ఉన్న తెలంగాణ,తమిళనాడు రాష్ట్రాల పార్టీలను చూసి అయినా నేర్చుకోండంటూ హితవు చెబుతున్నారు.డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని తెలిసినా తలాడించే పార్టీని ఏపీ ప్రజలుఎందుకు విశ్వసించాలన్న ప్రశ్న సోషల్ మీడియాలో ఎదురవుతుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏ మాత్రం ఆదుకోవడం లేదు. పోలవరంప్రాజెక్టుకు మినహా.. రాజధాని నిర్మాణానికి కూడా కనీసం నిధులను కూడా ప్రత్యేకంగా కేటాయించలేదు. అలాగే పునర్విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అలాంటి కేంద్ర ప్రభుత్వానికి అండగానిలవడంపై జగన్ పార్టీ నిసోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. బీజేపీకి బీ టీంగా వ్యవహరిస్తున్నారు.రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన జగన్ కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వానికిమద్దతు ప్రకటిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే వైసీపీ నేతల వాదన మరోలా ఉంది. కాంగ్రెస్ పార్టీ తమ పార్టీ అధినేతను పదహారు నెలల పాటు జైలులో ఉంచిందని, రాష్ట్ర విభజనకుకారణమయిన కాంగ్రెస్ తో తాము ఎలా చేతులు కలుపుతామని ప్రశ్నిస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన జరిగి పదేళ్లకు పైగా అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి స్వార్థ ప్రయోజనాల కోసంఫ్యాన్ పార్టీ పాకులుండుతుందని, అందుకే ఇలా వ్యవహరిస్తుందని సోషల్ మీడియాలో వైసీపీని విమర్శిస్తున్నారు.

# ముంబై ఇండియన్స్ జట్టులో విభేదాలు.. స్టేడియంలోనే హార్దిక్ Vs బుమ్రా మధ్య గొడవ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కి ఈ సీజన్ లో ఏది కలిసిరావడం లేదు. గురువారం నాడు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ముంబై ఘెర పరాజయం పాలైంది. ముంబై ఇండియన్స్ కి ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ముంబై పాయింట్ల పట్టికలో 8వ రెండో స్థానంలో కొనసాగుతోంది. కాగా వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న ముంబై జట్టులో అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా- స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా మధ్య జరిగిన మాటల యుద్ధం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

196 పరుగుల భారీ లక్ష్య చేధనలో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడుతూ క్రీజులో పాతుకుపోయాడు. అతడ్ని ఔట్ చేసేందుకు హార్దిక్ తీవ్రంగా ప్రయత్నించాడు. అయినప్పటికి ఫలితం మాత్రం లభించలేదు. దీంతో పాండ్యా తన సహనాన్ని కోల్పోయాడు. బుమ్రా బౌలింగ్ చేస్తున్నప్పుడు హార్దిక్ పదే పదే ఫీల్డర్లను మారుస్తూ విసిగించాడు. తన బౌలింగ్ కి తగ్గట్టుగా ఫీల్డింగ్ పెట్టుకునే ఛాన్స్ ఇవ్వకుండా, హార్దిక్ జోక్యం చేసుకోవడం బుమ్రాకు నచ్చలేదు.. హార్దిక్ పాండ్యా చేసిన ఓవరాక్షన్ అతడికి ఏమాత్రం నచ్చలేదు. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది.

బుమ్రా అసహనంతో నీవు నాకు చెప్పొద్దు అన్నట్లు చేసిన సైగలు చేసినప్పటికీ, ఏదేమైనప్పటికి చివరికి కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిర్ణయానికే బుమ్రా తలవంచాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా ఈ ఏడాది ఐపీఎల్ 2026లో బుమ్రా దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ భారత పేస్ గుర్రం ఇప్పటి వరకు 5 మ్యాచ్లు ఆడి ఒక్క వికెట్ కూడా తీయలేదు.

# టీ20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. కెనడా కెప్టెన్‌పై ఐసీసీ విచారణ!






**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ భూతం మరోసారి వణికిస్తోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా కెనడా జట్టు ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విచారణ ప్రారంభించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో తన కథనంలో వెల్లడించింది.కెనడాకు చెందిన 'ది ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్.. 'కరప్షన్, క్రైమ్ అండ్ క్రికెట్' పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీ ఈ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్‌పై ప్రధానంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలింగ్‌కు దిగిన కెనడా పేసర్లు తొలి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చారు. మూడో ఓవర్ వేసిన స్పిన్నర్ సాద్ బిన్ జాఫర్ వికెట్ తీసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మెయిడెన్ ఓవర్ పూర్తి చేశాడు. ఇలాంటి కీలక సమయంలో ఐదో ఓవర్ వేయడానికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా స్వయంగా బంతిని అందుకున్నాడు. ఆ ఓవర్లో ఒక నో-బాల్, రెండు వైడ్లతో సహా ఏకంగా 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఆ ఓవర్లో భారీగా పరుగులు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ.కేవలం ఈ ఒక్క ఆరోపణే కాకుండా కెనడా క్రికెట్ బోర్డుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) మరికొన్ని విచారణలు కూడా జరుపుతోంది. జాతీయ జట్టులో కొందరు ఆటగాళ్లను ఎంపిక చేయాలని కోచ్ ఖుర్రం చౌహాన్, బోర్డు సభ్యులు ఒత్తిడి చేసినట్లుగా ఉన్న ఒక ఫోన్ కాల్ ఆడియో గతంలో లీక్ అయింది. దీనిపైనా ఏసీయూ దర్యాప్తు చేస్తోంది.ఈ ఆరోపణలపై ఐసీసీ ఇంటిగ్రిటీ యూనిట్ జనరల్ మేనేజర్ ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ స్పందించారు. ఈ డాక్యుమెంటరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే విచారణ దశలో ఉన్న అంశాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆరోపణలతో కెనడా క్రికెట్ బోర్డుతో పాటు టీ20 ప్రపంచకప్ పారదర్శకతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# శ్రేయస్ క్యాచ్‌కు సచిన్ ఫిదా.. అద్భుతమంటూ కితాబు




**హైదరాబాద్ పెన్ పవర్:** గత రాత్రి ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ క్యాచ్‌ను, తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా అభివర్ణించాడు. కేవలం అథ్లెటిజం మాత్రమే కాదని, దాని వెనుక అద్భుతమైన అవగాహన, సమయస్ఫూర్తి ఉన్నాయని సచిన్ ప్రత్యేకంగా విశ్లేషించాడు.శ్రేయస్ అయ్యర్ క్యాచ్ గురించి సచిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... "బంతి వేగాన్ని, ఎత్తును అంచనా వేయడం, బౌండరీ లైన్ ఎక్కడుందో గమనించుకోవడం, దాన్ని తొక్కకుండా సరైన సమయంలో గాల్లోకి లేవడం.. ఇవన్నీ అద్భుతం. అంతటితో ఆగకుండా, గాల్లో ఉండగానే బంతిని పట్టుకుని, కిందపడేలోపు తన సహచర ఫీల్డర్‌కు అందించాడు. ఆ సమయంలో తన టీమ్‌మేట్ ఎక్కడున్నాడో కూడా కచ్చితంగా తెలిసి ఉండాలి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది" అని వివరించారు.ఇలాంటి ఫీట్ చేయాలంటే నమ్మశక్యంకాని అవగాహన, టైమింగ్, ఫిట్‌నెస్, సంయమనం అవసరమని సచిన్ తెలిపారు. "శ్రేయస్ అయ్యర్ అన్నింటినీ కచ్చితంగా అంచనా వేశాడు. నేను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది కచ్చితంగా ఒకటి" అని సచిన్ కొనియాడారు.

# పెళ్లి ఆలస్యంతో సమాజాన్ని జయించినట్లేనా?



క్లాసిక్ ఆఫ్-వైట్ చీర లుక్‌లో ప్రగ్యా నాగ్రా స్టన్స్



నటి కృతికా కమ్రా వివాహ బంధం - వ్యక్తిగత నిర్ణయాల పై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సాధారణంగా సమాజంలో వయసు రాగానే పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి ఉంటుంది. కానీ తాను 37 ఏళ్ల వయసులో వివాహం చేసుకోవడాన్ని సరైన నిర్ణయంగా అభివర్ణించారు. జీవితంలో ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం వల్ల ఎంచుకున్న భాగస్వామి పట్ల, నిర్ణయం పట్ల సంపూర్ణమైన స్పష్టత ఉంటుందన్నారు. ఆ సమయంలో ఏం చేస్తున్నామో? బాగా తెలుస్తుందని విశ్లేషించారు. తన స్నేహితులందరికీ పదేళ్ల క్రితమే వివాహాలు అయిపోయాయని గుర్తు చేసుకుంటూ వారంతా ఓ రకమైన సామాజిక ఒత్తిడి వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే కృతిక తల్లిదండ్రులు పెళ్లి విషయంలో ఎన్నడూ తనని ఒత్తిడి చేయలేదని దీంతో కావాల్సినంత సమయం దొరికిందన్నారు. కెరీర్ , వ్యక్తిగత జీవితంపై పూర్తి అవగాహన వచ్చిన తర్వాతే తాను వైవాహిక బంధంలోకి అడుగుపెట్టానని ఇది తనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తుందన్నారు. గౌరవ్ కపూర్ - కృతికల వివాహం ఎంతో నిరాడంబరంగా కేవలం సన్నిహితుల మధ్య జరిగింది. భారీ హంగులు, డెస్టినేషన్ వెడ్డింగ్ వంటి ఆర్భాటాలకు తాము దూరంగా ఉన్నామన్నారు. -మాకు పెళ్లి వేడుక కంటే వివాహ బంధం అనేది చాలా పెద్ద విషయం అని స్పష్టం చేశారు. లోకానికి చూపించుకోవడానికి చేసే ఖర్చు కంటే ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితాన్ని పంచుకోవాలనే ఉద్దేశం బలంగా ఉండాలని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే పెళ్లి సమయంలో తన భర్త గౌరవ్ కపూర్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని కృతిక గుర్తు చేసుకున్నారు. నిత్యం వందలాది మంది ముందు లైవ్ షోలు ఇచ్చే గౌరవ్, తమ వివాహ సమయంలో కన్నీళ్లు పెట్టుకోవడం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. కృతికను వధువు రూపంలో చూడగానే గౌరవ్ కళ్లలో నీళ్లు తిరగడం, ఆ బంధం పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు.తన ప్రాణ స్నేహితుడిని భర్తగా పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెళ్లి అనేది వ్యక్తిగత నిర్ణయమని అది ఎప్పుడు చేసుకోవాలనేది సదరు వ్యక్తులే నిర్ణయించుకోవాలని కృతిక సూచించారు. వయసును బట్టి కాకుండా మానసిక సిద్ధతను బట్టి అడుగు వేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే మరోవైపు వైవాహిక జీవితాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నానన్నారు.

పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అంటే సమాజాన్ని ఓడించినట్లు కాదు. సమాజపు అసంబద్ధమైన ఒత్తిడికి తలొగ్గకుండా ఉండటమే. జీవితానికి మనం యజమానులమని, మన నిర్ణయాలు మనం తీసుకోగలమని నిరూపించడమే అసలైన విజయం. ఇది ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు గౌరవించుకుంటూ కలిసి ఉండాలని నిర్ణయించుకున్నప్పుడే ఆ వివాహం విజయవంతం అవుతుంది.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్ లేస్ మరియు పెర్ల్స్‌లో సొగసుగా, అభిమానులను విస్మయానికి గురి చేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com